అడుగు బయట పెట్టాలంటే హడల్

- పట్టణంలో పెరిగిపోయిన కుక్కల బెడద
- తరచూ ప్రజలపై దాడులు చేస్తున్న శునకాలు
- మున్సిపల్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేసినా కనిపించని ప్రయోజనం



మార్కెట్ వీధిలో ఉన్న వీధి కుక్కలు

కదిరి టౌన్ : కుక్కల బెడదతో పట్టణ ప్రజలు అడుగు బయటపెట్టాలంటే హడలెత్తిపోతున్నారు. ఎటువైపు నుంచి వచ్చి కుక్కలు దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ కనిపించిన వారిపై దాడి చేస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీనిపై కౌన్సిల్ సభ్యులు పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో పట్టణ ప్రజలు అనుక్షణం భయభయంగా రోడ్లపై రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

రోడ్డుపై వెళ్లాలంటే భయమే..

మున్సిపల్ పరిధిలో కుటాగుళ్ల, రాజేంద్రప్రసాద్ వీధి, మారుతీనగర్, అడపాలవీధి, కంచుకోట, వలీసాబ్ రోడ్డు, కూరగాయల మార్కెట్, జమీయా మసీదు, అమీన్‌నగర్, నారాయణమ్మ కాలనీ, మశానంపేట, నానాదర్గా, పార్థసారథి కాలనీ, అజంతా టాకీస్, రైల్వేస్టేషన్ రోడ్డు, వీవర్స్ కాలనీలో, శివాలయం వీధుల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రోడ్లపై పదుల సంఖ్యలో సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నపిల్లలు బయటకు రావాలంటే జంకుతున్నారు. కుక్కల బెడదపై పలుమార్లు మున్సిపల్ కౌన్సిల్‌లో సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు.

తూతూమంత్రంగా చర్యలు..

కుక్కల బెడదపై ఫిర్యాదు వెల్లువెత్తడంతో అధికారుల తూతూమంత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. గతంలో కొన్ని కుక్కలను వలతో పట్టి దూరప్రాంతాలకు తరలించారు. అయితే కొన్నిరోజులకే పరిస్థితి యథాతథంగా మారింది. పట్టణంలో కవర్లలో ఆహార పదార్థాలు తీసుకెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ప్రధానంగా కూరగాయలు మార్కెట్ సమీపంలో ఉన్న మటన్ మార్కెట్‌లో మటన్ తీసుకునేవారు ఎప్పుడు ఏ కుక్క దాడి చేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కుక్కల బెడదపై మున్సిపల్ కమిషనర్ వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

వీధి కుక్కలను నియంత్రించాలి



పట్టణంలో వీధి కుక్కలను నియంత్రించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. గతంలో వీధి కుక్కల దాడిలో 15 మంది చిన్నారులు ఆస్పత్రి పాలైన ఘటనలు ఉన్నాయి. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. చిన్నారులు బయట ఆడుకోవాలంటేనే భయపడుతున్నారు.

–జగన్మోహన్, కదిరి

కుక్కలతో తీవ్ర ఇబ్బందులు



మా వీధిలో వీధి కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై ఎన్నిసార్లు మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు. వృద్ధులు, పిల్లలు బయటకు రావాలంటే భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలి.

–శాంతిబాయి, శివాలయం వీధి

క్లుప్తంగా

జాతీయస్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నల్లమాడ: స్థానిక పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికయ్యారు. నెల్లూరు జిల్లా కావలిలో ఈనెల 16, 17వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీల్లో డీడీఎస్ఎస్ 1-60 విభాగంలో ఎస్. తహీర్, డీ. జీవన్, ఎం. సుదీప్ బంగారు పతకం, 4-30 విభాగంలో డీ. జయసూర్య, డీ. జీవన్, ఎస్. తహీర్, బీ. రూపేష్ బంగారు పతకం, బీ. పవన్ కుమార్ నాయక్, సింగల్ బౌన్స్ (బ్రాంజ్ మెడల్), డీ. జయసూర్య, డబుల్ అండర్ (బ్రాంజ్ మెడల్) సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పోలే వెంకటరెడ్డి పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ భూపాల్‌లో సెప్టెంబర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

పెండింగ్ డీఏలు ప్రకటించాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఏపీయూఎస్ నాయకులు

ధర్మవరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) జిల్లా గౌరవ సలహాదారు అన్నం అరవింద్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావొస్తున్నా కనీసం ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని తెలిపారు. ఇంకా ఆలస్యమైతే రాష్ట్ర ఉద్యోగులందరూ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, వాసు, దూలెప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.


నీటి విడుదల

కదిరి అర్బన్: మండలంలోని చెర్లోపల్లి జలాశయం నుంచి కుప్పం బ్రాంచ్‌కెనాల్‌కు ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హంద్రీ–నీవా నీటిని విడుదల చేశారు. రైతాంగానికి సాగునీటితో పాటు కదిరి పట్టణానికి తాగునీరు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలోనే గాండ్లపెంట మండలానికి హంద్రీ–నీవా నీటిని ఇస్తామని చెప్పారు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’

బత్తలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహానాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండల స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానించిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం తాలూకా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పర్యవేక్షణాధికారి మున్వర్ బాషా తెలిపారు. అధ్యక్షుడిగా వెంకటాచలపతి, ఉపాధ్యక్షుడిగా వెంకటేశులు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా ఆశ, కోశాధికారిగా ఫణీకుమార్, జిల్లా కౌన్సిలర్లుగా శ్రీకాంత్, హసీనాను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు లెక్కల శ్రీనివాసులు, మల్లికార్జున, విజయభాస్కర్ రెడ్డి, నియాజ్, అల్లాబకాష్, తాడిపత్రికి చెందిన హరిబాబు పాల్గొన్నారు.

బంగారు నగల బహూకరణ

అమరాపురం: మండల పరిధిలోని కెంచమాంబదేవి అమ్మవారికి ముద్దప్ప అనే భక్తుడు రూ.8 లక్షల విలువైన బంగారు నగలను అందజేశారు. ముద్దప్ప కుటుంబ సభ్యులు ఆదివారం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం బంగారు ఆభరణాలను ఆలయ అర్చకుడికి అందజేశారు.

పీఆర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ సభ్యులు

బత్తలపల్లి: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంఘం ధర్మవరం తాలూకా నూతన అధ్యక్షుడు అక్కిం ప్రతాప్ పేర్కొన్నారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సంఘం ధర్మవరం తాలూకా యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యక్షుడిగా అక్కిం ప్రతాప్, ఉపాధ్యక్షురాలిగా బి.కరుణశ్రీ, ప్రధాన కార్యదర్శిగా సుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శిగా డి.శ్రీనివాసులు, ట్రెజరర్‌గా సి.సుదర్శన్‌రెడ్డి, డీసీ మెంబర్–1గా ఎం.అబ్దుల్‌నబీ, డీసీ మెంబర్–2గా ఎం.గోపాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఎన్నికల అధికారిగా రావి.విజయ్‌శేఖర్‌నాయుడు, జిల్లా ఎన్నికల పరిశీలకులు లెక్కల శ్రీనివాసులు వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, మల్లిఖార్జున, విజయ్‌భాస్కర్ రెడ్డి, రామకిశోర్, ఎస్.హరిబాబు, ఎస్ అల్లాబకాష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



కారు, టాటా ఏస్ వాహనం ఢీకొన్న దృశ్యం

ముదిగుబ్బ: మండలంలోని దొరిగిల్లు ఘాట్ రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..తాడిమర్రి మండలం పుల్లనారాయణపల్లికి చెందిన చెన్నకేశవరెడ్డి తన టాటా ఏస్ వాహనంలో పాడిఆవును మండలంలోని టీఎన్ పాళ్యంలో దింపి తిరుగుపయనమయ్యాడు. ఈక్రమంలో ఘాట్ రోడ్డుపై వద్ద రోడ్డుపై ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొన్నాడు. ఘటనలో బైక్‌పై ఉన్న అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గాండ్లపర్తికి చెందిన సాకే పెద్దన్న తీవ్రగాయాలయ్యాయి. బైక్‌పై వెనుక కూర్చున్న సాకే లక్ష్మీదేవి తలకు రక్తగాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా టాటా ఏస్ వాహనం బైక్ వెనుకొస్తున్న కారును ఢీకొంది. కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. అయితే ఘటనలో తీవ్రంగా గాయపడిన భార్యభర్తలను బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాల ఢీ

- ఇద్దరు యువకులకు గాయాలు



గాయపడిన యువరాజు, రాజు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. రాప్తాడు మండలం పాలవాయి గ్రామానికి చెందిన రాజు, యువరాజు అనే యువకులు ద్విచక్ర వాహనంలో మామిళ్లపల్లి బస్టాండ్ సర్కిల్‌లో రోడ్డు దాటుతుండగా.. ధర్మవరం వైపు నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. దీంతో ఇద్దరు యువకులు కింద పడటంతో గాయపడ్డారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రతి ఒక్కరూ సత్యాన్ని గ్రహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధ్యాన మాస్టర్ వెంకటరెడ్డి

బత్తలపల్లి: మానవుడు జీవించినప్పుడే సత్యాన్ని గ్రహించాలని ధ్యాన మాస్టర్లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీహరిహర పిరమిడ్ ధ్యాన మందిరంలో ధ్యాన మాస్టర్ మండల నాగేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం–ఆనందం కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మవరం సీనియర్ ధ్యాన మాస్టర్లు నాగేంద్రమ్మ, వెంకటరెడ్డి, మున్ని మాట్లాడుతూ ఏదీ మన వెంట రాదని మన జీవితంలో పుట్టినప్పటి నుంచి మరణించేంత వరకు ఎంత సంపాదించినా, ఎంత కూడబెట్టినా శరీరం వదిలేటప్పుడు వీటిని తీసుకెళ్లలేమన్నారు. ప్రతి ఒక్కరూ సత్య, ధర్మ, ధ్యాన, జ్ఞానమార్గంలో ప్రయాణించాలన్నారు. అనంతరం ధ్యాన సాధనకు విచ్చేసిన ధ్యానులకు ముల్లగూరు రామానాయుడు, వెంకటలక్ష్మీ దంపతులు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ధ్యాన మాస్టర్లు మదనాపు కొండన్న, నెట్టెం నాయుడు, అశ్వర్థమ్మ, ముల్లగూరు సరోజ, బి.యశోధ, బి.గోపాల్, మగ్గం నరసింహులు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని ఊరేగింపు



పూల పల్లకీపై శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న శ్రీకృష్ణుని విగ్రహం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని ప్రతిమను ఆదివారం పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన పూల పల్లకీపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామికి పూజలు నిర్వహించారు. పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్, ప్రబోధ సేవా సమితి సభ్యులు లక్ష్మీనారాయణ, మల్లికార్జున, నాగేంద్ర, ఎస్‌వీ భాస్కర్, నాగభూషణ, సూరి, రమణ, లచ్చి, బాలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం శ్రీకృష్ణుడి పూజ, భగవద్గీత పఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రీకృష్ణునికి పంచామృతాలతో అభిషేకాలు, తులసి పత్రి పూజ నిర్వహించారు. రాత్రి భజన బృందాలతో భజనలు చేయించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

అధ్వానంగా కునుకుంట్ల- దాడితోట రహదారి



గుంతలు పడిన కునుకుంట్ల, దాడితోట రోడ్డు

తాడిమర్రి: మండలంలోని కునుకుంట్ల–దాడితోట గ్రామాల రహదారి అధ్వానంగా తయారైంది. కునుకుంట్ల నుంచి పొలాల మధ్యగా కాటికోటేశ్వర క్షేత్రం కొండ నడకదారి సమీపంలో పులివెందుల వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర రహదారి ఉంది. గతంలో వేసిన కంకర పోయి ప్రస్తుతం మట్టి రోడ్డుగా మారిపోయింది. నార్పల మండలం ముచ్చుకుంటపల్లి, సోదనపల్లి, నల్లపరెడ్డిపల్లి, పప్పూరు తదితర గ్రామాల ప్రజలు దాడితోటకు వెళ్లాంటే ఇదే దగ్గర దారి. అయితే దారి గుంతలు అధికంగా పడటంతో పది కిలోమీటర్లు చుట్టీకుని చిల్లకొండయ్యపల్లి మీదుగా వాహనదారులు వెళుతున్నారు. కునుకుంట్ల గ్రామానికి చెందిన రైతుల భూములు గ్రామం నుంచి సుమారు నాలుగు కిలోమీటర్లకు వరకు రహదారికి ఇరువైపులా ఉన్నాయి. దారి అధ్వనంగా ఉండటంతో పంట ఉత్పత్తులు తరలించానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



రామగిరి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పోలీసులు వాహనదారులను హెచ్చరించారు. ఎస్పీ రత్న ఆదేశాలతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా, మద్యంసేవించి వాహనాలు నడపడం,నిర్లక్ష్యపు డ్రైవింగ్, వాహనాల రికార్డుల పరిశీలన, పెండింగ్ చలానాలు తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. వాహనాల రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పాతనేరస్తులను పోలీస్‌స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

కాలనీల్లో కంపు కంపు



కర్ణాటకనాగేపల్లిలోని వీధిలో నిల్వ ఉన్న మురుగునీరు



మరో వీధి చివర నిలిచిన మురుగు నీరు

పుట్టపర్తి అర్బన్: మున్సిపాలిటీలోని కర్ణాటకనాగేపల్లి వీధులు దుర్వాసన వెదజల్లుతున్నాయి. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరంతా రోడ్లపైనే నిలుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద ఎక్కువై రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నుంచి వచ్చి మురుగునీరంతా నల్లమాడ ప్రధాన రహదారిపై నిలుస్తోంది. దీనికి తోడు వర్షపునీరు తోడవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.

నేడు ‘బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ’

కదిరి అర్బన్: మండలంలోని మొటుకుపల్లిలో వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ మణికంఠనాయక్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్దెత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

21న జ్వాలాపురంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

బత్తలపల్లి: జ్వాలాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 21న పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. 21వ తేదీ ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు, భజన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వీఆర్‌ఏల సమస్యలపై నిరంతర పోరాటం



వీఆర్‌ఏల సంఘం నూతన కమిటీ సభ్యులు

బత్తలపల్లి: వీఆర్‌ఏల సమస్యలపై నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని ఆ సంఘం మండల అధ్యక్షులు మందల నరసింహులు, ఉపాధ్యక్షులు మాతంగి రాజా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండలంలోని వీఆర్‌ఏల సమావేశమై సమస్యలపై చర్చించారు. అనంతరం సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండలాధ్యక్షుడిగా మందల నరసింహులు, ఉపాధ్యక్షుడిగా మాతంగి రాజా, ప్రధాన కార్యదర్శిగా మాల్యవంతం రాంప్రసాద్, ట్రెజరర్‌గా నారాయణస్వామి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగార్జున, శివశంకర్, రామాంజనేయులు, గంగనారాయణ, నారాయణస్వామి, కదిరప్ప, ఎం.బాబు, రామాంజి, లక్ష్మీనరసమ్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లమాడ: మండలంలోని బీ. రామాపురం గ్రామానికి చెందిన వేమన్న గౌడ్ (75) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ గ్రామానికి వెళ్లి వేమన్న గౌడ్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జూనియర్ ఎన్టీఆర్‌పై ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

పుట్టపర్తి/ పుట్టపర్తి టౌన్: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు సరికాదని వైఎస్సార్‌సీపీ బుక్కపట్నం మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప, పుట్టపర్తి మున్సిపాలిటీ యువజన విభాగం అధ్యక్షుడు సందీప్ నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు వారు ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఇదంతా జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే జూనియర్ ఎన్టీఆర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.